నమస్తే తెలంగాణ





చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

# ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# తాగిన డిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

# ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

## ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మవోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## 'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పొగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.



సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

# హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్ మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే



హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

### హోంగార్డుల సమస్యలపై పట్టింపేదీ?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.


## విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 5: గిరిజన విద్యార్థుల భవిష్యత్ బాగుండాలంటే హెచ్‌ఎం, వార్డెన్, సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గురువారం బీఈడీ కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని హెచ్‌ఎం, వార్డెన్లు, సబ్జెక్టు టీచర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. నూతనంగా ప్రవేశపెట్టిన మెనూతో పాటు ఉద్దీపకం బుక్‌లెట్ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ తప్పకుండా నిర్వహించి వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేసి పదో తరగతి పిల్లలందరూ అత్యుత్తమ గ్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక ద్వారా చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన అవగాహన కల్పించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఈ ఏడాది ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినందున సులభమైన పద్ధతిలో పిల్లలకు అర్థమయ్యే రీతిలో పంపిణీ చేసిన ఉద్దీపకం వర్క్‌బుక్ స్టడీ అవర్స్ పెంచాలని, స్పెషల్ ఆఫీసర్లు వర్క్‌బుక్స్ గురించి పిల్లలకు ఏ విధంగా బోధిస్తున్నారో పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్యవంతమైన ఆహారం అందించాలని, వారి ఆరోగ్యం, చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంవో రమణయ్య, శ్రీరాములు, ఏటీడీవోలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, చంద్రమోహన్, సత్యవతి, రాధమ్మ, జీసీడీవో అలివేలు మంగతాయారు, ఐటీడీఏ స్పెషలాఫీసర్లు భాస్కరన్, ఉదయ్‌కుమార్, మునీర్‌పాషా, హరికృష్ణ, హెచ్‌ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.


## మంచినీటి చెరువులో చెత్త వేయొద్దు



పనులను పరిశీలిస్తున్న దమ్మాలపాటి

ఇల్లెందు, డిసెంబర్ 5: ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మంచినీటి చెరువులో చెత్త వేయవద్దు అని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మున్సిపల్ పాలకవర్గం, సిబ్బంది ఆధ్వర్యంలో చెరువు కట్టమీద పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి మాట్లాడారు. చెరువులో ఎవరూ చెత్త వేయవద్దని, అతి త్వరలో మినీ ట్యాంక్‌బండ్‌గా చెరువు కట్టను తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో అంకు షావలి, మురళి, తార, రవీందర్, నవీన్ కుమార్, సయ్యద్ ఆజాం, నాగేశ్వరరావు, పద్మావతి, సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

## చూడముచ్చటగా నందులచెలక ప్రాథమిక పాఠశాల



నోటు పుస్తకాలపై విద్యార్థినిచే రాయిస్తున్న నోడల్ ఆఫీసర్ బెక్కంటి శ్రీనివాసరావు

దుమ్ముగూడెం, డిసెంబర్ 5: మండల పరిధిలోని నర్సాపురం కాంప్లెక్స్ పరిధిలో నందులచెలక ప్రాథమిక పాఠశాల వాతావరణం చూడముచ్చటగా ఉందని కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్ బెక్కంటి శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో పిల్లలకు అన్ని రకాల పండ్లు దొరికేలా పండ్ల మొక్కలు నాటిన విధానం, విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం చూడముచ్చటగా ఉందన్నారు. గురువారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలకు అందించిన నోటుపుస్తకాలపై డీఈవో ఇచ్చిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం విద్యార్థులతో స్వయంగా రాయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ దుర్గారావు, కిషన్, వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మి, సుశీల, సమ్మక్క, శాంతమ్మ పాల్గొన్నారు.

# 'మెగా ఫుడ్‌పార్క్' సభ వెలవెల

- పొగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- సభ మధ్యలోనే వెళ్లిపోయిన ప్రజలు, ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు



సభలో శ్రీధర్‌బాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : సత్తుపల్లి మండలం బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు అక్కడి నుంచి లేచి ఇంటిదారి పట్టారు. సభ నడుస్తుండగానే ప్రజలు లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. సభకు ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. కరీంనగర్ వాసి, శ్రీపాదరావు కుమారుడు శ్రీధర్‌బాబుతో పని చేస్తున్న నాకు ప్రస్తుత క్యాబినెట్‌లో ఇష్టమైన మంత్రి అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పట్టు వదలని విక్రమార్కుడు తుమ్మల అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి సైతం ఇద్దరు మంత్రులను పొగడడం కోసమే సమయం కేటాయించారు. దీంతో సభ ఆసాంతం పొగడ్తతోనే సరిపోయింది. ఇందులో ప్రజలకు పనికొచ్చే సందేశం లేకపోవడంతో సభకు వచ్చిన వారు నెమ్మదిలో అక్కడి నుంచి వెళ్లి పోవడంతో చివరకు ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి.



నీటికుంట

# వినూత్న సాగు.. విభిన్న పద్ధతుల ద్వారా జీవనోపాధి



సెలైన్ బాటిళ్ల నీటి చుక్కలు



మొక్కల్లో కలుపు తీస్తున్న మహిళలు

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 5: నీటిని వృథా చేయకుండా వినూత్న ఆలోచనలతో పంటలు పండించవచ్చని మండలంలోని దిబ్బగూడెం గ్రామంలోని మొడియం రాములమ్మ నిరూపించింది. మండల పరిధిలోని మల్లాయిగూడెం పంచాయతీ దిబ్బగూడెంలో మొడియం రాములమ్మకు నాబార్డు సహకారం, వాసన్ సంస్థ పర్యవేక్షణలో జీవ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించేందుకు నీటి కుంట తవ్వించారు. ఆ కుంట చుట్టు 54 రకాలకు పైగా పండ్లు, కూరగాయల మొక్కలు నాటించారు. రోజూ మొక్కలకు నీరు అందించడం కష్టంగా మారింది. వినూత్నంగా ఆలోచన చేశారు. మొక్కలు చనిపోకుండా ఉండేందుకు ప్రతి మొక్క వద్ద సపోర్టుగా కర్రవేసి ఆ కర్రకు వాడిపడేసిన సెలైన్ బాటిళ్లను తీసుకువచ్చి అమర్చింది. బాటిల్లో నీరు నింపి పెట్టడంతో ఒక్కొక్క చుక్క నీరు మొక్కలకు అందుతుంది. బెండ, టమాట, వంగ, మిర్చి, కూరగాయలు, మామిడి, సపోట, ఆపిల్ బేర్, అరటి, కొబ్బరి, వక్క, జామ, నిమ్మ వంటి పండ్ల మొక్కలు, బీర, సోర, కాకర, చిక్కుడు తీగజాతి కూరగాయలు, చిలకడ దుంప జాతి ఇలా రకరకాల మొక్కలు నాటించారు. అంతే కాకుండా పాంపాండ్‌లో చేప పిల్లలు వేసి పెంచుతుంది. ఆ చేప పిల్లలకు తన పశువుల పేడను ఘన జీవామృతంగా తయారు చేసి ఆహారంగా అందిస్తుంది. రసాయనిక మందులు వినియోగించకుండా కషాయాలు వినియోగిస్తున్నట్లు ఆమె తెలిపారు. గత ఏడాది ఇదే పద్ధతి పాటించి చేపలు, ముల్లంగి, కూరగాయాల ద్వారా సుమారు రూ.22వేలకు పైగా ఆదాయం వచ్చిందని రాములమ్మ తెలిపారు. గిరిజన మహిళగా కూలీ పనులు చేసుకునే తనకు జీవనోపాధి కల్పించిన నాబార్డు, వాసన్, జీవ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 5: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీ. బాబురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గుంపెన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏవో అనూష, ఏఈవో ప్రశాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏవో బాబురావు

## ఉద్యమ నాయకుడికి వీడ్కోలు

రామవరం, డిసెంబర్ 5: తెలంగాణ ఉద్యమకారుడు మోరె భాస్కర్‌రావు బుధవారం మృతిచెందారు. కొత్తగూడెం రామవరంలోని స్వగృహంలో ఆయన మృతదేహాన్ని తోటి ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. స్వగృహం నుంచి కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వరకు సాగిన అంతిమ యాత్రలో, అంత్యక్రియల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, నాయకులు దిండిగల రాజేందర్, వనమా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పాడె మోసి వీడ్కోలు పలికారు. నాయకులు వనమా రాఘవేందర్‌రావు, వెంకటరమణ, సంకుబాపన అనుదీప్, తొగరు రాజశేఖర్, బండి రాజుగౌడ్, యూసుఫ్, ఐలయ్య, హుస్సేన్, నవతన్, మధు తదితరులు నివాళులర్పించారు.

## పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

### పశువైద్యాధికారులు బాలకృష్ణ, రాజేందర్



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

బూర్గంపహాడ్, డిసెంబర్ 5: పెరటికోళ్ల పెంపకం, పశుపోషణలో రైతులు తీసుకోవాల్సిన, పాటించాల్సిన జాగ్రత్తలపై మండల పశువైద్యాధికారులు బాలకృష్ణ, రాజేందర్ పాడి రైతులకు అవగాహన కల్పించి పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపురం, మోరంపల్లిబంజర్ గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించి 985 పశువులకు సాధారణ వైద్యం అందించారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. సురేష్, లత, అశోక్, సునీల్, చంద్రావతి, జ్యోతి, రాజశ్రీ, శివజ్యోతి, రాజు, శ్రీను, అనూష, వంశీకృష్ణ, విజయ్‌భాస్కర్, తేజ, అనూష, పశువైద్య కళాశాలల విద్యార్థులు, జిల్లా పశుసంవర్ధకశాఖ బృందం అసిస్టెంట్ డైరెక్టర్లు ఠాగూర్, సత్యప్రకాష్, సంతోష్, వాసంతి పాల్గొన్నారు.

## అడవులు నరికితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న రేంజర్ ఉపేందర్

మణుగూరు టౌన్, డిసెంబర్ 5: కొత్తగా అడవులను నరికి పోడు సాగు చేసుకోవాలని చూస్తే సహించేది లేదని, అటవీ సంపదను అక్రమంగా నరికివేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు రేంజర్ ఉపేందర్ స్పష్టం చేశారు. మణుగూరు మండలంలోని కట్టుమల్లారం గ్రామంలో గురువారం ప్రజలకు అగాహన సదస్సు నిర్వహించారు. కొత్తగా ఎవరైనా అడవిని నరకడం, వన్యప్రాణులను వేటాడడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ సంపద అంతరించిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది శ్యాం, లక్ష్మయ్య, రామచంద్రయ్య, ముజాహిద్దీన్, రవి, ధనుంజయ్, ప్రసాద్, సంధ్య, పద్మ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.